క్లుప్తంగా

నిర్దేశించిన లక్ష్యం పూర్తి చేయాలి



నర్సరీని పరిశీలిస్తున్న తిరుపతిరెడ్డి

శివ్వంపేట(నర్సాపూర్): గ్రామాల్లో మొక్కలు నాటేందుకు నిర్దేశించిన లక్ష్యాన్ని పూర్తి చేయాలని ఇన్‌చార్జి ఎంపీడీఓ తిరుపతిరెడ్డి స్పష్టం చేశారు. మండలంలోని కొంతన్‌పల్లి, దంతన్‌పల్లి గ్రామాల్లో గురువారం అంగన్‌వాడీ కేంద్రాలు, నర్సరీలను, మొక్కలు నాటేందుకు తీస్తున్న గుంతలను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈసారి మండల వ్యాప్తంగా 1.97లక్షల మొక్కలు నాటేందుకు ప్రణాళిక సిద్ధం చేశామని అందుకనుగుణంగా లక్ష్యం పూర్తి చేసేందుకు సిబ్బంది కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీఓ అనిల్‌కుమార్, పంచాయతీ కార్యదర్శు లున్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



వెల్మకన్నలో సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేస్తున్న మాజీ ఎంపీపీ నవీన్‌గుప్త

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని వెల్మకన్న గ్రామానికి చెందిన వెంకటయ్య, సుధాకర్‌కు వైద్యం కోసం మంజూరైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను గురువారం మాజీ ఎంపీపీ ఉపాధ్యక్షుడు నవీన్‌గుప్త లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ఎమ్మెల్యే సునీతారెడ్డి సహకారంతో చెక్కులు మంజూరయ్యాయన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు రవిసాగర్, అశోక్, ప్రభు పాల్గొన్నారు.

పరిశుభ్రతలో రాజీపడొద్దు

చిన్నశంకరంపేట(మెదక్): గ్రామాల్లో పరిసరాల పరిశుభ్రత విషయంలో సిబ్బంది రాజీపడొద్దని డీఎల్‌పీఓ సురేశ్‌బాబు స్పష్టం చేశారు. మండలంలోని శాలిపేట, చెన్నాయిపల్లి గ్రామాలను గురువారం సందర్శించిన ఆయన జీపీ రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య పనులు నిర్వహించాలని సూచించారు. ఈ సందర్భంగా శాలిపేట గ్రామ కార్యదర్శి సంతోశ్‌కుమార్‌కు పలు సూచనలు చేశారు.

ఆయిల్‌పామ్‌పై రైతుల ఆసక్తి



పొలాన్ని పరిశీలిస్తున్న ఏఓ రాజేశ్ తదితరులు

అల్లాదుర్గం(మెదక్): మండలంలో ఆయిల్ పామ్ సాగుకు రైతులు ముందుకొస్తున్నారని ఏఓ రాజేశ్ చెప్పారు. మండల పరిధిలోని సీతానగర్ గ్రామంలో ఆయిల్‌పామ్ సాగుకు రైతుల పొలాలను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆయిల్‌పామ్ సాగుతో అధిక లాభాలతోపాటు, పెట్టుబడి తగ్గుతుందని సూచించారు. కంపెనీలు కూడా రైతులను ప్రోత్సహించేందుకు ముందుకు వస్తున్నట్లు తెలిపారు. ఏఈఓ నవీన్, ఆయిల్ పామ్ ఫీల్డ్ అధికారి పాల్గొన్నారు.

40 వేల ఎకరాలకు సాగుకు నీరు

రేగోడ్(మెదక్): రాష్ట్ర మంత్రి దామోదర రాజనర్సింహ కృషితో అందోల్ నియోజకవర్గంలోని పలు మండలాలకు లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా 40 వేల ఎకరాలకు సాగుకు నీరందించనున్నామని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎస్.దిగంబర్‌రావు, పీసీసీ సభ్యుడు ఎం.కిషన్ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అందోల్, వటపల్లి, టేక్మాల్, రేగోడ్, అల్లాదుర్గం మండలాల్లోని ప్రతీ ఎకరాకు సాగునీరు అందస్తామని చెప్పారు. అందులో భాగంగా సర్వే కోసం రూ.1.08కోట్లు మంజూరు చేశారని చెప్పారు. సర్వేకు రైతులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో వట్‌పల్లి ఏఎంసీ డైరెక్టర్ శ్రీధర్‌గుప్తా, మాజీ ఎంపీటీసీ ఎం.నరేందర్, పీఏసీఎస్ మాజీ చైర్మన్ రధాకిషన్, కోఆప్షన్ మాజీ సభ్యుడు చోటుమియా, జి.సంగమేశ్వర్, పీర్యానాయక్ పాల్గొన్నారు.

20న శివ్వంపేటలో బోనాల మహోత్సవం

శివ్వంపేట(నర్సాపూర్): మండల కేంద్రమైన శివ్వంపేటలో ఈనెల 20న బోనాల మహోత్సవం నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించి నిర్వహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ మేరకు నిర్వాహకులు గురువారం ఓ ప్రకటనలో వెల్లడించారు. గ్రామంలో కొలువైన పోచమ్మ, ముత్యాలమ్మ ఆలయాల్లో ప్రత్యేక పూజలు, బోనాల ఊరేగింపు నిర్వహించనున్నట్లు తెలిపారు.

బస్సు సౌకర్యం లేక అవస్థలు

- 12 గ్రామాలకు కష్టంగా మారిన రవాణా
- సమస్య పరిష్కరించాలంటూ వేడుకోలు



మోడల్ పాఠశాలకు నడుస్తున్న ఆర్టీసీ బస్సు

చేగుంట(తూప్రాన్): మండల కేంద్రం చేగుంటలోని ఆయా గ్రామాలను కలుపుతూ నియోజకవర్గ కేంద్రానికి బస్సులు లేకపోవడంతో ప్రజలు ఆటోలు, ప్రైవేటు వాహనాలను ఆశ్రయించాల్సిన పరిస్థితి నెలకొంది. గతంలో దుబ్బాక నుంచి భూంపల్లి, చేగుంట మీదుగా సికింద్రాబాద్‌కు చేగుంట మోడల్ పాఠశాల విద్యార్థుల కోసం రెండు ట్రిప్పుల బస్సులు నడిచేవి. ఈ బస్సులతో మండలంలోని ఉల్లితిమ్మాయిపల్లి, రుక్మాపూర్, ఇబ్రహీంపూర్, బోనాల్, బీకొండాపూర్ గ్రామాలతో పాటు దౌల్తాబాద్, భూంపల్లి మండలాల గ్రామాల ప్రజలకు ఈ బస్సులు మంచి రవాణా సౌకర్యంగా ఉండేది. ఏడాది క్రితం సికింద్రాబాద్ బస్సును రద్దు చేయడంతో మూడు మండలాలకు చెందిన 12 గ్రామాలకు రవాణా సౌకర్యం గగణంగా మారింది. బీకొండాపూర్ గ్రామస్తులు మండల కేంద్రానికి రావాలంటే రెండు ఆటోలు మారాల్సి ఉండగా అదే బస్సు సౌకర్యం ఉంటే ఇబ్బంది తప్పేది. మోడల్ పాఠశాల కోసం కేవలం ఉదయం సాయంత్రం మాత్రమే బస్సును నడపడంతో విద్యార్థులతోనే బస్సు కిటకిటలాడి సాధారణ ప్రయాణికులు ప్రైవేటు వాహనాలను ఆశ్రయించాల్సిన పరిస్థితి దాపురించింది. గ్రామీణ ప్రజల రవాణా కష్టాలను దృష్టిలో ఉంచుకొని ఆర్టీసీ అధికారులు దుబ్బాక నుంచి చేగుంట వరకు సరిపడా బస్సులను నడపాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న దివ్యాంగులు

పెన్షన్ రూ.6 వేలకు పెంచండి

- చట్టాలు అమలులో నిర్లక్ష్యం తగదు
- కలెక్టరేట్ ఎదుట దివ్యాంగుల నిరసన

మెదక్ కలెక్టరేట్: ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు దివ్యాంగుల పెన్షన్‌ను వెంటనే రూ.6 వేలకు పెంచాలని ఎన్‌పీఆర్డీ జిల్లా కార్యదర్శి యశోద డిమాండ్ చేశారు. ఎన్‌పీఆర్డీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట గురువారం ధర్నాచేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్థానిక సంస్థల్లో దివ్యాంగులకు ప్రాతినిధ్యం కల్పించేందుకు చట్టం చేయాలన్నారు. దివ్యాంగుల పెన్షన్ రూ.6వేలకు పెంచుతామని అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిందని, అధికారంలోకి వచ్చి 19 నెలలు గడుస్తున్నా ఎందుకు పెంచడం లేదని ప్రశ్నించారు. అలాగే దివ్యాంగుల చట్టం ప్రకారం ఇందిరమ్మ ఇళ్లలో 25 శాతం అదనంగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. చట్టాలను అమలు చేయడంలో అధికారులు ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారని మండిపడ్డారు. స్థానిక సంస్థల ఎన్నికల లోపు పెన్షన్ పెంచకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎన్‌పీఆర్డీ నాయకులు యాదగిరి, దుర్గ, శ్రీదేవి, స్వరూప, శ్రీనివాస్, శ్రీకాంత్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి

ఎంఈఓ బాలరాజు



బోధనను పరిశీలిస్తున్న ఎంఈఓ బాలరాజు

కౌడిపల్లి(నర్సాపూర్): చదువులో వెనుకబడిన విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఎంఈఓ బాలరాజు తెలిపారు. గురువారం మండలంలోని ధర్మాసాగర్ ప్రాథమిక పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్ పరిశీలించారు. తరగతి గదిలో హెచ్‌ఎం దివ్య విద్యాబోధనను గమనించారు. విద్యార్థులను ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ .. విద్యార్థులు ప్రతిరోజు బడికి వచ్చేలా చూడాలన్నారు. అంకితభావంతో విధులు నిర్వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు.

సన్నాహక సమావేశాన్ని జయప్రదం చేయండి

మెదక్ కలెక్టరేట్: సీఐటీయూ రాష్ట్ర మహాసభల ఆహ్వాన సంఘం ఈనెల 19న పట్టణంలోని శ్రీ సాయి బాలాజీ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించనున్న సన్నాహక సమావేశానికి కార్మికులు పెద్ద సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి మల్లేశం పిలుపునిచ్చారు. సీఐటీయూ రాష్ట్ర మహాసభలు డిసెంబర్ 7 నుంచి 9 వరకు 3 రోజుల పాటు మెదక్ పట్టణంలో నిర్వహిస్తున్నామన్నారు. ఈ సన్నాహాక సమావేశానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర, జాతీయ నాయకులు హాజరు కానున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి సంతోశ్ పాల్గొన్నారు.

పీజీ, ఇంజనీరింగ్ కళాశాలలు మంజూరు చేయాలి

ఎస్‌ఎఫ్‌ఐ డిమాండ్

మెదక్ కలెక్టరేట్: జిల్లాకు పీజీ, ఇంజనీరింగ్ కళాశాలలను మంజూరు చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ మెదక్ మండల అధ్యక్షుడు అజయ్ కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం మెదక్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేశారు. అనంతరం అజయ్‌కుమార్ మాట్లాడుతూ...విద్యార్థులకు సంబంధించిన సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే చొరవ చూపాలన్నారు. గతంలో మెదక్ జిల్లాకు పీజీ కళాశాల ఉండగా దాన్ని తొలగించారన్నారు. ఇప్పుడు మెదక్ జిల్లాలో విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించేందుకు ఇతర జిల్లాలకు వెళ్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ టౌన్ బాధ్యులు బసవలింగం,రాజు,కార్తిక్ తదితరులు పాల్గొన్నారు.

పీఆర్సీని వెంటనే ప్రకటించాలి

చిలప్‌చెడ్(నర్సాపూర్): ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు వెంటనే పీఆర్సీని ప్రకటించి, బదిలీలతో కూడిన పదోన్నతులు ఇవ్వాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కోశాధికారి అజయ్ కుమార్ డిమాండ్ చేశారు. గురువారం ఆయన చిలప్‌చెడ్ మండల పాఠశాల ఉపాధ్యాయులతో టీఎస్‌యూటీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఉపాధ్యాయ సమస్యలు పట్ల అలసత్వం వహిస్తుందని అన్నారు. రిటైర్డ్ అయిన ఉద్యోగులకు, అదే రోజు జీపీఎఫ్, ఇతర బిల్లులు మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ మండల అధ్యక్షుడు మోహన్, ఉపాధ్యక్షుడు ఆదినారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వనమహోత్సవాన్ని జయప్రదం చేయండి

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండలంలో వనమహోత్సవ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎంపీడీఓ ఖలీముల్లా కోరారు. గురువారం చిలప్‌చెడ్‌లో పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు, ఇంటి నిర్మాణ చేపట్టేలా ప్రోత్సాహించాలన్నారు. జాతీయ పంచాయతీ అవార్డులపై సమగ్ర సమాచారం సేకరించి, తుది నివేదికను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీఓ తిరుపతి, ఏపీఓ శ్యామ్. హౌసింగ్ ఏఈ అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

వేతనాలు చెల్లించాలని వినతి



ఎంపీడీఓకు వినతి పత్రం అందజేస్తున్న ఉపాధి హామీ సిబ్బంది

నర్సాపూర్ రూరల్: ఉపాధి హామీ పథకం సిబ్బందికి సంబంధించిన మూడు నెలల వేతనాలు చెల్లించాలని కోరారు. ఈ మేరకు గురువారం నర్సాపూర్ ఎంపీడీఓ మధులతకు సిబ్బంది వినతి పత్రం అందజేశారు. వేతనాలు రాకపోవడంతో కుటుంబ పోషణ కష్టంగా మారిందన్నారు. అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవాల కోసం నర్సాపూర్ వచ్చిన మంత్రి వివేక్‌కు సైతం వినతి పత్రం అందజేసినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు గున్నాల పోచన్న, ప్రభాకర్ గౌడ్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ఉర్సు ఉత్సవాలు

వెల్దుర్తి(తూప్రాన్): మాసాయిపేట మండలం రామంతాపూర్ దర్గాలో ఉర్సు ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా యోగీశ్వరుల సమాధి పవిత్ర స్నానం, చందన సుగంధం సమర్పణ, ఖవ్వాలి వంటి కార్యక్రమాలు నిర్వహించారు. ఆశ్రమ పీఠాధిపతి ఖాజామొహ్మద్ ఫిరోజిద్దీన్ చిస్తి తదితరులు పాల్గొన్నారు.



చాదర్ సమర్పిస్తున్న భక్తులు

సస్యరక్షణ చర్యలతో పంటలకు మేలు



పత్తిసాగును పరిశీలిస్తున్న రాహుల్‌విశ్వకర్మ, తదితరులు

ఏరువాక శాస్త్రవేత్త రాహుల్ విశ్వకర్మ

చిలప్‌చెడ్(నర్సాపూర్): వరి, పత్తి పంటసాగులో సమగ్ర సస్యరక్షణ చర్యలు పాటిస్తే అధిక దిగుబడి సాధించవచ్చని సంగుపేట ఏరువాక శాస్త్రవేత్త రాహుల్ విశ్వకర్మ అన్నారు. గురువారం ఆయన, తన బృందంతో కలసి చండూర్ శివారులోని రైతు చంద్రశేఖర్‌రెడ్డి సాగు చేస్తున్న వరి, పత్తి పంటలను పరిశీలించి, వర్షకాలంలో చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులు, సాగులో పాటించాల్సిన మెలుకువల గురించి వివరించారు. ఈ సందర్భంగా రాహుల్ విశ్వకర్మ మాట్లాడుతూ.. వరి నాటేసి, వారం రోజులు అవుతుందని, ప్రస్తుతం వరి బాగానే ఉందన్నారు. కాగా నారుమడి తీసేందుకు మరోవారం రోజుల సమయం ఉందనుకునే రైతులు కార్బోసిరాన్ 3జీ గుళికలు, ఎకరాకు సరిపోయే నారుమడిలో 860 గ్రాములు వేయాలన్నారు. అలాగే, పత్తిలో దోమ, పేనుబంక చీడలను గుర్తించడం జరిగిందని, వాటి నివారణకు 5 ఎంఎల్ నీమ్ అయిల్, లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. మరో శాస్త్రవేత్త నిర్మల మాట్లాడుతూ.. ఉద్యానవన పంటల యాజమాన్యం, చేపట్టాల్సిన మెలుకువల గురించి వివరించారు. కార్యక్రమంలో ఏరువాక కేంద్రం సిబ్బంది శ్రీకాంత్, ఆకాశ్, రైతు చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

అరకపట్టి.. కలుపు తీసి

పంటలను పరిశీలించిన ఏఓ జావేద్



పత్తి పంటలో అరకతో కలుపు తీస్తున్న ఏఓ

రేగోడ్(మెదక్): మండలంలోని జగిర్యాల గ్రామంలో గురువారం స్థానిక ఏఓ జావేద్ అరకపట్టి.. కలుపు తీసి పంటల పరిశీలన వినూత్నంగా చేశారు. స్వయంగా ఏఓనే అరకపట్టి పంట వివరాలను రైతుతో మాట్లాడి తెలుసుకోవడంతో వ్యవసాయ శాఖపై రైతులు ప్రశంసలు కురిపిస్తున్నారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ.. పత్తి, కూరగాయల పంటలను పరిశీలించానని.. పత్తి పంటలో రసం పీల్చే పురుగుల ఉధృతి ఎక్కువగా ఉంటుంది. వాటి నివారణకి ఫ్లోనికామీడ్ 60గ్రా లేదా, ఎసిటమీప్రైడ్ 40గ్రాముల మందుని 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. కూరగాయాల పంటలపై సస్యరక్షణ చర్యలు పాటించి అధిక దిగుబడులు పొందాలన్నారు. కార్యక్రమంలో ఏఈఓ మహేశ్, రైతులు పాల్గొన్నారు.

తెగిపడిన విద్యుత్ వైరు తప్పిన ప్రమాదం

విద్యుత్ సిబ్బందిని నిలదీసిన స్థానికులు



లైన్‌మెన్‌తో వాగ్వాదానికి దిగిన స్థానికులు

అల్లాదుర్గం(మెదక్): విద్యుత్ వైరు తెగిపడటంతో త్రుటిలో పెను ప్రమాదం తప్పింది. ఇద్దరు ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. వైరు తెగిపడిన రెండు గంటల వరకు విద్యుత్ సిబ్బంది మాత్రం ఏ విధమైన చర్యలు చేపట్టలేదు. ఐదు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు తీవ్రమైన అవస్థలు అనుభవించారు. ఈ ఘటన అల్లాదుర్గంలో గురువారం చోటు చేసుకుంది. ఉదయం ఆరు గంటల ప్రాంతంలో విద్యుత్ వైరు తెగిపడింది. అదే సమయంలో అటుగా వెళ్తున్న ఇద్దరిపై పడాల్సింది. వారులో త్రుటిలో తప్పించుకున్నారు. స్థానికంగా ఉండాల్సిన సిబ్బంది అందుబాటులో ఉండటంలేదని, ప్రమాదాలు జరిగితే పట్టించుకునే వారు కరువయ్యారని ప్రజలు వాపోతున్నారు. వైరు తెగిపడిన రెండు గంటల తర్వాత సిబ్బంది చేరుకుని మరమ్మతులు చేపట్టారు. అలాగే మరో ప్రాంతంలో విద్యుత్ వైరు కలవడంతో మంటలు చేలరేగాయి. ఆ పనులు చేసేందుకు మరో రెండు గంటల సమయం పట్టింది. దీంతో అల్లాదుర్గంలో ఐదు గంటలు పాటు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. అలాగే రెండు రోజులుగా నీటి సరఫరా కూడా నిలిచిపోవడంతో లైన్‌మెన్‌ను స్థానికులు నిలదీశారు.

సీఎం సహాయనిధి పేదలకు వరం



రేగోడ్ లబ్ధిదారులతో కాంగ్రెస్ నాయకులు

రేగోడ్(మెదక్): సీఎం సహాయనిధి పేదలకు వరంగా మారిందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎస్.దిగంబరరావు, పీసీసీ సభ్యుడు ఎం.కిషన్ అన్నారు. 11 మంది లబ్ధిదారులకు మంజూరైన రూ.4.86 లక్షల విలువైన చెక్కులను మండల పరిషత్ కార్యాలయం వద్ద గురువారం వారు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేద ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు శంకరప్ప, పీఏసీఎస్ వైస్ చైర్మన్ రాధాకిషన్, ఎస్టీసెల్ జిల్లా అధ్యక్షుడు పీర్యానాయక్, నాయకులు కృష్ణ, శివాజీ, ముఖీం తదితరులు పాల్గొన్నారు.

పీసీసీ చీఫ్‌కు సన్మానం

నర్సాపూర్: పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌ను కాంగ్రెస్ నాయకులు ఘనంగా సన్మానించారు. గురువారం పీసీసీ చీఫ్ నర్సాపూర్ మీదుగా మెదక్‌కు వెళ్తుండగా డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ ఆవుల రాజిరెడ్డితో పాటు పలువురు పార్టీ నాయకులు శాలువాలతో సన్మానించి స్వాగతం పలికారు. సన్మానం అనంతరం పీసీసీ చీఫ్‌తో పాటు పలువురు నాయకులు మెదక్‌కు వెళ్లారు.



పీసీసీ చీఫ్‌ను సన్మానిస్తున్న కాంగ్రెస్‌నాయకులు

పేదల కోసం సేవా కార్యక్రమాలు



నూతన కమిటీ

నర్సాపూర్: లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పేదలకు ఉపయోగపడే విధంగా సేవా కార్యక్రమాలు చేపడతామని లయన్స్‌క్లబ్ ఆఫ్ నర్సాపూర్ స్నేహబంధు నూతన అధ్యక్షుడు రాఘవేందర్‌రావు చెప్పారు. క్లబ్ నూతన కమిటీ ప్రమాణ స్వీకారం బుధవారం రాత్రి జరిగింది. కార్యదర్శిగా అశోక్‌కుమార్, కోశాధికారిగా వెంకటస్వామిగౌడ్ ప్రమాణస్వీకారం చేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ మాజీ డిస్ట్రిక్ట్ గవర్నర్లు రాజ్‌కుమార్, శ్రీనివాస్, డాక్టర్ రామకృష్ణారెడ్డి, లయన్స్ ప్రతినిధులు విజయలక్ష్మి, బుచ్చేష్‌యాదవ్, ఆంజనేయులుగౌడ్, నర్సింహారెడ్డి జైపాల్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

బెట్టింగ్ యాప్‌లే విద్యార్థి ప్రాణం తీశాయి

నర్సాపూర్ రూరల్: బెట్టింగ్ యాప్‌లపై అవగాహన కల్పిస్తున్నా యువకుల్లో మార్పు రావడం లేదు. బీటెక్ విద్యార్థి తరుణ్ ఆత్మహత్య ఇందుకు నిదర్శనంగా చెప్పుకోవచ్చు. తమ కొడుకు ఉన్నత చదువులు చదివి ప్రయోజకుడు కావాలని తల్లిదండ్రులు కూలి పనులు చేసి, అప్పులు చేసి డబ్బులు పంపిస్తే తరుణ్ చదువును పక్కనబెట్టి బెట్టింగ్ యాప్‌లకు బానిసై తనువుచాలించాడు. నర్సాపూర్‌లో బీవీఆర్‌ఐటీలో బీటెక్ చదువుతున్న గిరిజన విద్యార్థి అజ్మీరా తరుణ్ బుధవారం ఆత్మహత్యకు పాల్పడిన విషయం విదితమే. కేసు నమోదు చేసిన నర్సాపూర్ పోలీసులు గురువారం దర్యాప్తు చేపట్టారు. ఆత్మహత్యకు గల కారణాలను వెలికితీశారు. బెట్టింగ్ యాప్‌లకు బానిసై ఆర్థిక ఇబ్బందులు ఎదురు కావడంతో తరుణ్ ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై లింగం తెలిపారు. కొంతకాలంగా తరుణ్ బెట్టింగ్ యాప్‌ల ద్వారా డబ్బులు పెట్టుబడి పెడుతూ ఆర్థికంగా నష్టపోయినట్లు తమ దర్యాప్తులో తేలిందన్నారు. తల్లిదండ్రులు ఇంటి నుంచి పంపించిన డబ్బులతో పాటు బంధువులు, స్నేహితులు, ఫోన్‌యాప్‌ల ద్వారా లోన్లు తీసుకొని అప్పుల పాలై ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు.

సంక్షిప్త వార్తలు

◆ కాలేజీల్లో ఎన్నికలు నిర్వహించండి

పాపన్నపేట(మెదక్): కాలేజీలు, యూనివర్సిటీల్లో విద్యార్థి సంఘం ఎన్నికలు నిర్వహించాలని కోరుతూ ముఖ్యమంత్రికి భహిరంగ లేఖ రాసినట్లు మాజీ ఎమ్మెల్యే, ఆర్ట్స్ కాలేజీ మాజీ అధ్యక్షుడు శశిధర్‌రెడ్డి చెప్పారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కాలేజీల్లో సమస్యల గురించి ప్రిన్సిపాల్స్ దృష్టికి తీసుకెళ్లేందుకు సంఘాల నాయకులు అవసరం అన్నారు. అందుకే అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ కాలేజీలు, యూనివర్శిటీలు, ఐటీఐలు, పాలిటెక్నిక్, ఇంజనీరింగ్, మెడికల్ కళాశాలల్లో వెంటనే విద్యార్థి సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలని కోరినట్లు తెలిపారు.

◆ అంగన్‌వాడీ కేంద్రం పరిశీలన

పాపన్నపేట(మెదక్): మండల పరిధిలోని నాగ్సాన్‌పల్లి అంగన్‌వాడీ కేంద్రాన్ని గురువారం సూపర్‌వైజర్ శ్రీదేవి పరిశీలించారు. ఈసందర్భంగా పలువురు గ్రామస్తులు అంగన్‌వాడీ టీచర్ యాదమ్మపై పలు ఆరోపణలు చేశారు. చిన్నారులకు ఆహారం సరిగా ఇవ్వడం లేదని, చదువు చెప్పడం లేదని ఆరోపించారు. ఆమెపై చర్యలు తీసుకోవాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు.

◆ విద్యుత్‌షాక్‌తో పాడి గేదె మృతి

చిలప్‌చెడ్(నర్సాపూర్): విద్యుత్ షాక్‌తో పాడి గేదె మృతి చెందిన ఘటన చిలప్‌చెడ్ మండలం ఫైజాబాద్ గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన వంజరి బాబు బుధవారం గేదెలను మేపడానికి గ్రామ శివారుకు తీసుకెళ్లాడు. ఓ గేదెశివారులోని ఓ సర్వీస్ వైరుకు తగలడంతో విద్యుత్‌షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందింది. గేదె మృతితో జీవనోపాధి కోల్పోయానని, ప్రభుత్వం తనను ఆదుకోవాని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు.

◆ స్వర్ణకారుల సమస్యలు పరిష్కరించండి

రామాయంపేట(మెదక్): స్వర్ణకారులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని సంఘం ప్రతినిధులు గురువారం మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌కు వినతిపత్రం అందజేశారు. తమ సమస్యల పరిష్కారం విషయమై సీఎంతో మాట్లాడాలని వారు విజ్ఞప్తి చేశారు. జర్నలిస్టు యూనియన్ జిల్లా అధ్యక్షుడు శంకర్ దయాల్‌చారి, సంఘం జిల్లా అధ్యక్షుడు పూన రవిచారి, జిల్లా ప్రధాన కార్యదర్శి సుంకోజ దామోదర, రామాయంపేట మండలశాఖ అధ్యక్షుడు రామకృష్ణ, ఉపాధ్యక్షుడు రవీందర్‌చారి తదితరులు పాల్గొన్నారు.

◆ వ్యక్తి రిమాండ్

చిన్నశంకరంపేట(మెదక్): చోరీకి పాల్పడిన వ్యక్తిని అరెస్ట్ చేసి గురువారం రిమాండ్‌కు తరలించినట్లు రామాయంపేట సీఐ వెంకటరాజగౌడ్ తెలిపారు. ఈనెల 14న నార్సింగి మండల కేంద్రంలో ఆర్టీసీ ఉద్యోగి శ్రీనివాస్ ఇంటి తాళం పగులకొట్టి నగదు, బంగారం చోరీ చేసిన నిందితుడు బాలే నర్సింహులును అరెస్ట్ చేసినట్లు తెలిపారు. నిందితుడి వద్ద నుంచి రూ. 46,500 నగదు, ఇనుపరాడ్, మోటర్ సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నార్సింగి ఎస్ఐ అహ్మద్ మోహినొద్దీన్ ఉన్నారు.

◆ అప్రమత్తంగా ఉండాలి

కౌడిపల్లి(నర్సాపూర్): గ్రామాలలో మూడు రోజులపాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టిన పనులను కేంద్ర బృందం పరిశీలించనున్నందునా వివిధ శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీఓ శ్రీనివాస్ తెలిపారు. గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధిహామీ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ కేంద్రం బృందం ఈనెల 18న తునికి, 19న రాయిలాపూర్, 20న కొట్టాల గ్రామాలలో పర్యటించనున్నట్లు తెలిపారు.